

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## కట్నం వేలం..!

తనింట్లో అద్దెకి వచ్చిన ఓ కుర్రాడితో చెప్పిందో పెళ్ళికాని పిల్లల తల్లి.

"చూడు బాబూ! నాకు మొగుడులేడు. పెళ్ళికి ఎదిగిన కూతుళ్ళున్నారు. నువ్వా బ్రహ్మచారివి. పెళ్ళికొడుకుల కోసం తిరగలేను. కాబట్టి నువ్వు మా అమ్మాయిల్లో ఎవర్నయినా చేసుకుంటే తగిన కట్నమిస్తాను."

"కట్నం ఎంతిస్తారు?"

" అది నువ్వు ఏ అమ్మాయిని చేసుకుంటావనే దానిమీద ఆధారపడి ఉంటుంది. మా ఆఖరమ్మాయి వయసు ఇరవై. దాన్ని చేసుకుంటే ఐదు లక్షలు ఇస్తాను. దాని పైదాని వయసు వయసు పాతిక. పదిలక్షలు ఇస్తాను. దాని పైదాని వయసు ముప్పై. పన్నెండు లక్షలు కట్నం. దానికి పైన ఇంకోత్తుంది. దని వయసు 35. పదిహేను లక్షలు దాన్ని చేసుకునే వాడికిస్తాను.."

" అలాగా? నలభై అయిదు వయస్సుగల అమ్మాయిలెవరైనా మీకున్నారా?" ఆశగా ప్రశ్నించాడతను.

***

# క్రీడాభంగం

యర్రంశెట్టి శాయి

**ఫుట్‌బాల్** ఆట చూస్తున్న ఓ రుక్మిణమ్మగారు పక్కనున్న తన్ని అడిగింది.
"వాళ్ళు అలా ఆ బంతిని ఎందుకు తంతున్నారు?"
"అటూ ఇటూ గోల్ కీపర్ వెనుక వలలు ఉన్నాయ్ కదా! ఆ వలల్లోకి కొట్టాలి బంతిని.."
"మరి అలా ఒకరికొకరు అడ్డుపడకుండా ఉంటే తేలికగా కొట్టేయచ్చు కదా!"

***

**తను ప్రాణం** కన్నా ఎక్కువగా అభిమానించే ఫుట్ బాల్ టీమ్ మ్యాచ్ పోయే సరికి అతగాడికి రిఫరీమీద కోపం ముంచుకొచ్చింది. వెంటనే రిఫరీ దగ్గరకెళ్ళి-
"మీ కుక్క ఏదీ?" అనడిగాడతను.
రిఫరీ ఆశ్చర్యపోయాడు.
"నా కుక్కేమిటీ? నాకు కుక్కలు లేవసలు.."
"ఇదే మొదటి సారి నేను చూడడం." అన్నాడతను.
"ఏమిటి?"
"గుడ్డాడికి కుక్క లేకపోవటం.." అని వెళ్ళిపోయాడతను.

***

**ఊళ్ళోని ప్రముఖులంతా** కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నారు.
ఓ డాక్టర్ బౌలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి మ్యాచ్ చూడ్డానికొచ్చాడు.
"డాక్టర్ గారు ఎలా ఆడుతున్నారు?" పక్కనున్న వ్యక్తినడిగాడతను.
"అదరగొట్టేస్తున్నారు! ఇప్పటికిప్పుడే ఆయనకు అయిదు వికెట్లు, నలుగురు పేషెంట్లు దొరికారు.."

***

**"అన్ని జూదాల్లోకీ** రేసులు చాలా క్లీన్ స్పోర్ట్ కదూ?"
"కాకపోవడమేమిటి? వారానికోసారి దానివల్లే నా జేబు క్లీన్ అయిపోతుంటుంది.."

***

**ఓ అపీల్‌దేవ్** డాక్టర్ దగ్గరకొచ్చాడు.
"రోజూ రాత్రి క్రికెట్ కలలోకి రాక తప్పడం లేదండీ! ఎప్పుడు నేను టెస్ట్ మ్యాచ్ ఆడుతుండడమో, రంజీ ట్రోఫీ ఆడడమో, లేక వన్-డే ఇంటర్నేషనల్ ఆడుతుండమో ఏదో ఒకటి - కానీ కేవలం క్రికెట్ ఒక్కటే కలలో కొస్తుంది. క్రికెట్, క్రికెట్, క్రికెట్..రోజూ రాత్రిళ్ళు వరుసగా క్రికెట్ ! ఇదే నాకు వరీగ ఉంది."
"బహుశా రాత్రింబగళ్ళు నువ్వు క్రికెట్ గురించి ఆలోచిస్తుండటం వల్లే అలా జరుగుతోంది. ఓ పనిచేయండి..ఇవాళ్టి నుంచి నిద్రపోయే ముందు మీ ప్రియురాలిని తల్చుకోండి. దాంతో మీ ప్రియురాలే కలలోకి రావచ్చు" అన్నాడు డాక్టర్.
అపీల్ దేవ్ చిరాకుగా లేచి నిలబడ్డాడు. " అలాగయితే నేను బాటింగ్ చేసే ఛాన్స్ పోదూ?"

***

## చౌ..చౌ ఏరుకొచ్చిన నవ్వులు

"**రచయిత** వివేక్ లక్ష్మణ్ ని పోలీసులు అరెస్ట్ చేశారట.."
ఏం ఎందుకని?"
"అసలు పేరుతో ఒక పెళ్ళి, కలం పేరుతో ఇంకో పెళ్ళి చేసుకున్నాడట.."

***

"**మా అల్లుడికి** మరీ అనుమానం, కోపం రా"
"ఏం జరిగింది?"
"పలకరింపుగా నవ్వా అంతే! నన్ను చూసి నవ్వుతావా? అని అలిగి వెళ్ళిపోయాడు.."
"అసలు అల్లుడ్ని చూసిన తర్వాత నీ మొహంలో నవ్వెలా వచ్చింది?"

***

"**ఏంటి గురూ..**ఎన్నడూ లేనిది ఇవ్వాళ మారు వేషంతో దొంగతనానికి బయలుదేరావేంటి?"
"ఇవాళ కన్నం వెయ్యబోయేది మా ఇంటికే.."
"???"

***

"**సిగిరెట్ తాగే** వాళ్ళకంటే పక్కనుండి అది పీల్చేవాళ్ళకు కేన్సర్ వచ్చి చచ్చే అవకాశం ఎక్కువట"చైన్ స్మోకరైన భర్తతో అంది సూర్యాకాంతమ్మ.
"అందుకేగా నేను తాగేది.." భార్యమీదకు పొగ వదులుతూ చెప్పాడు! ***

**"కట్నం పాతికవేలే కదా!** అదనంగా పదిరూపాయలిచ్చారేమిటి?" పెళ్ళికొచ్చిన బంధువు ఆశ్చర్యపోతూ అడిగాడు.
"ఓ అదా.. మా అల్లుడు ఆటో డ్రైవర్ లే..మీటర్ మీద పదన్న మాట..!"

***

**టీచర్:** ఒరేయ్ బుడుగూ..డబ్బున్న వాళ్ళకూ లేని వాళ్ళకూ తేడా ఏంటి?
**బుడుగు:** డబ్బున్న వాళ్ళ ఇళ్ళకు 'కుక్క ఉంది జాగ్రత్త" అనే బోర్డు ఉంటుంది. లేని వాళ్ళ చుట్టూ కుక్కలుంటాయి కానీ బోర్డు ఉండదు.

***

**టీచర్:** నియంతృత్వానికీ, ప్రజాస్వామ్యానికి తేడా ఏంటి?
**బుడుగు:** బలవంతుడైన వ్యక్తి మన నెత్తిని చెయ్యిపెట్టడం నియంతృత్వం. మన చేతిని మనమే నెత్తిమీద పెట్టుకోవడం ప్రజాస్వామ్యం.

***

**"ఏరా..**కెమిస్ట్రీ పరీక్ష సరిగ్గా రాయలేదంటున్నావ్..అన్ని కాపీలు రాసి షర్టులో పెట్టుకున్నావ్ కదా?" అడిగాడు రాము.
"పొరబాటున కెమిస్ట్రీ షర్టుకు బదులు ఫిజిక్స్ షర్టు వేసుకున్నానా.." బాధగా చెప్పాడు బుడుగు.

***

**"ఈ మగాళ్ళ** మనస్తత్వం కనుక్కోవడం చాలా కష్టం పిన్నిగారూ.." అంది శకుంతల.
" ఏం జరిగిందమ్మా..?"
"నాజుట్టు చాలా అందంగా ఉంటుందనీ, వెంట్రుకలు నల్లగా పొడవుగా బాగుంటాయని మెచ్చుకుంటారు మా వారు.."
"మంచిదే కదా.."
"అది కాదండీ.. అవే వెంట్రుకలు ఇవ్వాళ ఉప్మాలో ఓ రెండు వస్తే నన్ను ఎన్ని తిట్లు తిట్టారో..!?" కోపంతో మూతి ముడుచుకుంది శకుంతల..!

***